ప్రజాశక్తి
బుధవారం 16 ఏప్రిల్ 2025
5
విజయనగరం

తాగునీటి సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. నగరంలో సక్రమ నీటి పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయినప్పటికీ ఎక్కడైనా తాగునీటి పంపిణీలో సమస్యలు ఎదురైతే ప్రజలు తమకు నేరుగా గాని, నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 98499 06486కు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. అక్కడక్కడ ఏర్పడిన పైపులైను లీకేజీలను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజాసమస్యలను, నీటి పంపిణీలో తలెత్తే ఇబ్బందులను కూడా సత్వర పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు.

సంకిలి ప్యారీలో

చక్కెర పరిశ్రమా!..బీరు ఫ్యాక్టరీయా?

- ఇథనాల్ ప్లాంట్ 120 కెవిపిడిగా మార్చడంతో రైతులు, కార్మికుల్లో ఆందోళన
- చెరకు రైతులకు క్లారిటీ ఇవ్వని యాజమాన్యం
- సాగుపై అన్నదాతలు డీలా

సంకిలిలోని ప్యారీ సుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్

ప్రజాశక్తి-రేగిడి

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఏకైక చక్కర కర్మాగారం సంకిలి ఇఐడి ప్యారి సుగర్ ఫ్యాక్టరీ ఉనికిపై రైతుల్లో ఆందోళన వ్యకమవుతోంది. ఈ ఫ్యాక్టరీకి అనుబంధ కర్మాగారంగా ఇథనాలు ప్లాంట్ నిర్మించడంతో త్వరలో ఈ ఫ్యాక్టరీ బీర్లు తయారీ పరిశ్రమంగా మారనుందా అనే అనుమానం అందరిలోనూ వ్యక్తమవుతోంది. అదే జరిగితే విజయనగరం జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలు పూర్తిగా కనుమరుగైనట్లే.

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెరకు రైతులకు సంకిలిలోని ఇఐడి ప్యారి సుగర్ ఫ్యాక్టరీయే దిక్కుగా ఉంది. ఇప్పటికే విజయనగరం జిల్లాలోని ఎన్‌సిఎస్ సుగర్స్, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలు ప్రభుత్వ విధానాల కారణంగా మూతపడ్డాయి. ఈ రెండు జిల్లాల్లో సుమారు 32 వేల మంది చెరకు రైతులు చెరకు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 12 వేల మంది రైతులు నాన్ అగ్రిమెంట్ ద్వారా సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి చెరకును లారీలు , ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తుండేవారు. గత రెండేళ్ల నుంచి ఈ రెండు జిల్లాల్లో సుగర్స్ యాజమాన్యం చెరకు సాగుపై డివిజన్ల వారీగా శాస్త్రవేత్తలతో రైతులకు దిగుబడులపై అవగాహన కల్పించడం, రాయితీలు, నూతన వంగడాలు వంటి వాటిపై పట్టించు కోకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గతంలో 48 కెఎల్‌పిడితో ఆల్కహాల్ కు సంబంధించిన స్పిరిట్‌ను ఈ ఫ్యాక్టరీ ఎగుమతి చేసేది. ఇటీవల ఆ ఇథనాలు ప్లాంటును రోజుకు 120 కిలోలీటర్లు (కెఎల్‌పిడి)గా పెంపుదల చేస్తూ నడుపుతున్నారు. వీటికి వాస్తవంగా షుగర్ మలాస్ రా మెటీరియల్‌ను వాడుతారు. ప్రస్తుతం మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి ఆల్కహాల్ స్పిరిట్‌గా మారుస్తున్నారు. యాజమాన్యం చెరకు పంటలు వద్దని, మొక్కజొన్న పంటలు మేలని రైతులకు చెప్పడంతో రైతుల్లో ఆందోళన వ్యకతమవుతోంది. ఈ నేపథ్యంలో రైతులు చెరకు పంటలు వేయలా.. వద్దా అనే అయోమయంలో పడ్డారు. వాస్తవానికి మురుగప్ప సంస్థ చెరకు రైతులకు క్లారిటీ ఇవ్వకపోవడంతో ఈ రెండు జిల్లాల రైతులు చెరకు సాగు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఏడాది ఉన్న మమ్ము తోటలు, మొక్క తోటలు కలిపి 11 ఎకరాలు వేసినట్లు యాజమాన్యం కాకి లెక్కలు చెబుతున్నారు. వీటి సరాసరి దిగుబడి 2.10 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. 2026 క్రషింగ్ సీజన్‌కు సగానికి పైగా చెరకు ఉందని రైతులే చెప్తున్నారు. ఇటీవల మురగప్ప సంస్థ యాజమాన్యం సంకిలి ప్యారి సుగర్స్ కు వచ్చి స్థానిక యాజమాన్యంతో చర్చించారు. పర్మినెంట్ ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కలిపి 122 మందిని ఎటువంటి నోటీసులు లేకుండా తొలగించడం పట్ల కర్మాగారం మూసివేతకు ఇదే తార్కాణమని కార్మికులు అంటున్నారు. మరి కొంతమంది ఉద్యోగులను పొమ్మనలేక పొగ పెడుతున్నట్లు చెన్నై కు బదిలీ చేస్తున్నట్లు తెలిసింది. ముందుగా మూడునెలల జీతం ఇచ్చి మరీ తొలగించడం అన్యాయమని పర్మినెంట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మిగిలిన వారిని కూడా రెండో లిస్టులో తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. 2026 నాటికి ఉన్న కొద్దిపాటి చెరకు క్రషింగ్ చేసి కార్మికుల వంతు వస్తుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరికి సెటిల్మెంట్ చేసే ఆలోచనలో యాజమాన్యం చూస్తుందని కార్మికులు తెలిపారు. కర్మగారంలో పనిచేసిన వారిని అర్ధాంతరంగా తొలగిస్తే 50 ఏళ్ల దాటిన కర్మాగార ఉద్యోగులు, కార్మికులు తమ కుటుంబాలతో వీధిన పడే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలోనే మురగప్ప సంస్థ యాజమాన్యం కర్మగార పరిస్థితులపై కొలంబాలో హెచ్ఒడిలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీ మూతపడుతుందా, లేకా బీర్లు పరిశ్రమగా మారుతుందా అనే అనుమానాలు వ్యకమతువుతున్నాయి.

ఉరుములు, మెరుపులతో వర్షం

- చల్లబడిన వాతావరణం.. సేద తీరిన ప్రజలు
- కూరగాయలు, నువ్వు రైతుల హర్షం

రేగిడిలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-రేగిడి, వంగర, బొబ్బిలి

జిల్లాలో పలు చోట్ల మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మూడు రోజులు పాటు వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపిన నేపథ్యంలో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మేఘావృతమై రేగిడి మండలంలోని సంకిలి, ఉంగరాడ మెట్ట, బూరాడ తదితర గ్రామాల్లో గాలి, ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. ఎండ తీవ్రతకు మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో వద్ధులు, చిన్నారులు, ప్రజలు అల్లాడు పోయారు. భారీ వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అలాగే ఈ వర్షంతో మొక్కజొన్న, నువ్వు పంట ఇతర అపరాలు పంటల రైతులు కొంతమేర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంగర మండలంలోని శివ్వాం, ఎం.సీతారాంపురం, తలగాం, వంగర, రుషింగి తదితర గ్రామాల్లో భారీ

వంగర మండలం శివ్వాంలో కళ్లాల్లో చేరిన వర్షపు నీరు

వర్షం కురిసింది. ఎండలు మెండుగా ఉండటం వల్ల ఉక్కపో తతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం లభించినప్పటికీ పలు గ్రామాలలో మరుగు నీటి కాలువలు సక్రమంగా లేనందున రోడ్ల పైన, లోతట్టు ప్రాంతాల ఇళ్లలో నీరు చేరింది. మండలంలో వివిధ గ్రామాలలో మొక్కజొన్న పంట కోత దశలో ఉండటం వల్ల రైతులంతా ముమ్మరంగా మొక్కజొన్న పంటను నూర్పుడి చేసి కల్లాల్లోనూ, పొలాల్లోనూ టార్పానులపై ఎండ బెట్టారు. అయితే మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురవడంతో కొంతమందికి చెందిన మొక్కజొన్న పంట తడిసి పోయిందని రైతులు ఆందోళనకు గురయ్యారు. అదేవిధంగా కల్లాలలో నీరు చేరడంతో ఆ నీటిని బయటకు తోడేందుకు రైతులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

బొబ్బిలిలో చిరుజల్లులతో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. వర్షం కూరగాయలు, చెరకు, నువ్వుల పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరంలో వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3గంటల నుంచి వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేతతీరారు.

నేడు కర్లాం నుండి ఎమ్మెల్యే కళా ఇంటికి పాదయాత్ర

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని కర్లాం గ్రామం వద్ద గల వెంకట్రామ పౌల్ట్రీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్లాం నుండి చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు ఇంటి వరకు బుధవారం రాయబార పాదయాత్రను చేయనున్నట్లు సిఐటియు నాయకులు టివి రమణ, అంబల్ల గౌరి నాయుడు, ఇప్పల గురు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్రకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వెంకట రామ పౌల్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతనెల 8నుంచి పౌల్ట్రీ వద్ద నిరసన తెలియజేస్తున్నామని అన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ డిసిఎల్ డైరెక్షన్‌కు లోబడి విధుల్లోకి తీసుకోవాలని, స్థానిక యువతకే 75శాతం ఉపాధి కల్పించాలనే డిమాండ్‌లపై చేస్తున్న ఈ పోరాటం లో భాగంగా సామూహిక రాయబారం చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు గేటు వద్ద పాదయాత్ర ప్రారంభించి ఎమ్మెల్యే ఇంటి వరకు సాగుతుందన్నారు. న్యాయ మైన సమస్యలు పరిష్కారానికై కార్మికులు చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలు,, ప్రజా ప్రతినిధులు అందరూ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి. ఈశ్వరరావు, సూరిబాబు, గొల్లబాబుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై

అభ్యంతరాలు స్వీకరణ : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ల ఆదేశాల మేరకు పూర్వపు విజయనగరం ఉమ్మడి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని మేనేజ్ మెంట్ల ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ప్రకటించామని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ఈ జాబితాల ఆధారంగా ఎస్జీటీ ల సమాన కేడర్ నుండి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి కోసం సబ్జెక్టు వారిగా టెంటెటివ్ సీనియారిటీ జాబితాను, స్కూల్ అసిస్టెంట్ సమాన కేడర్ నుండి గ్రేడ్ 2 హెచ్ఎంల ఉద్యోగోన్నతి కోసం సీనియారిటీ జాబితా రూపొందించినట్లు తెలిపారు. ఈ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఈనెల 14 నుంచి అందుబాటులోఉందని, ఈనెల 17లోగా అభ్యంతరాలను తెలపాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి పేరు, హోదాతో సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ వుందో స్పష్టంగా ఆధారాలతో పేర్కొనాలని తెలిపారు.

12న పైడితల్లమ్మ దేవర మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మే నెల 12న పైడితల్లి అమ్మవారి దేవర ఉత్సవం జరుగుతుందని అమ్మవారి దేవస్థానం ఉప కమీషనర్ కెఎంవిడివి ప్రసాదరావు తెలిపారు. మంగళవారం దేవస్థానం కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం ఊరేగింపు మే 12 సాయంత్రం 4గంటలకు వనంగుడి నుంచి బయలుదేరి గంటస్తంభం మీదుగా హుకుంపేట చేరుతుందని తెలిపారు. తిరిగి రాత్రి 10గంటలకు హుకుంపేటలో గల అమ్మవారి చదురు నుండి తే 13వ తేదీ ఉదయానికి మూడులాంతర్ల వద్ద గల చదురుగుడికి వేంచేస్తారని చెప్పారు. అప్పటి నుండి ఉయ్యాలకంబాల ఉత్సవం వరకు అమ్మవారు చదురుగుడిలో కొలువై ఉంటారన్నారు. సమావేశంలో సిబ్బంది, ఆలయ పూజారి వెంకటరమణ పాల్గొన్నారు.

నిధుల వినియోగంలోనూ వెనుకబాటే

- పడకేసిన పల్లె పండగ పనులు
- పశువుల శాలలు, ఫారం పాండ్స్ సగం సగం
- ఉపాధి కూలీల కష్టార్జితం రూ.103 కోట్లు వృథా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అభివృద్ధికి నోచుకోని రహదారి

ఎలాగూ కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేసి జిల్లాకు నిధులు రాబట్టుకునే పరిస్థితి లేదు. కనీసం ఉపాధి కూలీల కష్టార్జితం సాధించిన నిధులను కూడా సద్వినియోగం చేసుకునేందుకు చొవర చూపలేదు. ఫలితంగా జిల్లాకు చెందిన రూ.103కోట్లు వృథాగా పోయినట్టే అయ్యింది. ఫలితంగా జిల్లాలో పల్లెపండ పేరిట చేపట్టిన రోడ్లు, కాలువలు, పశువులు శాలలు, ఫారం పాండ్స్ పనులు సగానికి సగం మాత్రమే జరిగాయి.

గ్రామీణ జాతీయ ఉపాధి హామీలో భాగంగా పనులు చేపట్టిన కూలీలకు వచ్చిన సొమ్ముపై 2/3వ వంతు మొత్తాన్ని మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేటాయించాల్సిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది 1.81కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం 1.74కోట్ల పనిదినాలు (96.13శాతం) మాత్రమే ప్రభుత్వం కల్పించింది. లక్ష్యంకన్నా తక్కువగా పనులు చేయించడం బహుశా జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి. దీన్ని బట్టి పనులు దొరక్క కూలీలు అవస్థలు ఉపడ్డారన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. సుమారు మూడు నెలలుగా చేపడుతున్న 32వేల పనిదినాలకు రూ.67.51 కోట్ల మేర బకాయి కూడా ఉండడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారు. ఈ సంగతి పక్కనెబడితే గడిచిన ఆర్థిక సంవత్సరంలో కూలీలకు అందిన మొత్తంపై రూ.263.63కోట్ల మేర మెటీరియల్ కాంపొనెంట్ పనులు (రోడ్లు, కాలువలు, పశువుల శాలలు, ఫారం పాండ్స్ తదితరాలకు వినియోగించాల్సి వుండగా కేవలం రూ.160.63కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ఈ లెక్కన ఆర్థిక సంవత్సరం ముగియడం వల్ల మిగిలిన రూ.103కోట్లు వృథాగా పోయినట్టే. దీంతో, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరగాల్సిన పల్లెపండగ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అధికారిక లెక్కల ప్రకారం... మొత్తం 4,135 పనులు మంజూరు చేయగా, 2,129 పనులు మాత్రమే ప్రారంభించారు. ఇందులోనూ 1,399 పనులు మాత్రమే పూర్తయ్యాయి. పశువులు, గొర్రెలు,మేకలు, కోళ్ల ఫారాలకు సంబంధించిన షెడ్లు 700 వరకు చేపట్టాలని లక్ష్యం తీసుకున్న ప్రభుత్వం, ఆచరణలో 1,993 మాత్రమే మంజూరుచేసి, 1,013 షెడ్ల పనులు మాత్రమే చేపట్టింది. ఇందులోనూ 961 మాత్రమే పూర్తయ్యాయి. మరోవైపు ఫారం పాండ్స్, ఇంకుడు గుంతల లక్ష్యాలు కూడా నెరవేరలేదు. వీటిలో ముఖ్యంగా రోడ్లు, కాలువలు, షెడ్ల నిర్మాణాలు లక్ష్యానికి చేరుకోకపోవడం వెనుక జిల్లాలోని పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత కీలకంగా ఉపయోగించు కోవాల్సిన ఈ నిధులు, పనులపై తొలి నుంచీ తగిన సమీక్షలు లేవు. ఎమ్మెల్యేల నుంచి, జిల్లాకు చెందిన మంత్రి వరకు దృష్టిసారించక పోవడం వల్లే రూ. కోట్లు వెనక్కిపోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ గ్రామాల్లో రోడ్లు మెరుగుపడతాయని, కొత్తగా రోడ్లు వస్తాయని వేయి కళ్లతో ఆశించిన ప్రజానీకానికి నిరేశే ఎదురైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనైనా పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రాజ్యాంగం విశిష్టమైనది

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోతన్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక మహాయోగని, ఆయన రచించిన భారత రాజ్యాంగం ఒక విశిష్టమైనదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. జిల్లా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ కూడలి వద్ద గల అంబేద్కర్ భవనంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రొంగలి పోతన్న మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేద్కర్ స్వతంత్ర భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా దేశానికి విశేషమైన సేవలు అందించారని తెలిపారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు పి.షణ్ముఖరావు మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు భారతదేశానికి విశిష్టమైన, వైవిధ్యమైన భారత రాజ్యాంగం అనే మహా గ్రంథాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి వేదిక ప్రతినిధులు బంగారు రాజు, ఈఎస్ఎన్ రాజు, బి.కూర్మారావు, ప్రముఖ న్యాయవాది నాలుగెస్సల రాజు, పప్పు విశ్వనాథం పాల్గొన్నారు.

కరపత్రాలతో అవగాహన

ప్రజాశక్తి- విజయనగరం కోట

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ఉత్తమ సేవలందించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికను అనుసరించి ఉత్తమ సేవలను అందించాలని నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో పలు విభాగాల అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన వార్షిక కార్యచరణ ప్రణాళిక వివరాలను తెలిపారు. ప్రధానంగా వేసవికాలంలో ఎక్కడా నీటి కోసం ఖాళీ బిందెల ప్రదర్శనలు జరగకుండా చూడాలన్నారు. ప్రజారోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని శతశాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. వాణిజ్య ప్రాంతాలలో ప్రతి 50 మీటర్ల నిడివిలో ఒక చెత్తబుట్ట ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నా క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. పన్నుల వసూళ్ళను ముమ్మరం చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి చేపట్టిన భవన నిర్మాణాలు, అనధికార భవనాలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్ఒ డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, టౌన్ సర్వేయర్ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డిఇలు మణికుమార్, శ్రీనివాసరావు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

నగరంలోకమిషనర్ పర్యటన

నగరంలోని పలుప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య పర్యటించారు. ట్యాంక్ బండ్ రోడ్డు ప్రాంతంలో ఆచంట గార్డెన్ వద్ద చెత్తాచెదారాలు నిండి ఉండడాన్ని చూసి సిబ్బందిని మందలించారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- మెరకముడిదాం



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

మండలంలోని మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి సంబందించిన హాజరు పట్టిక, ఒపి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎన్‌సిడిసిడి ఆర్‌బికె (రాష్ట్రీయ బాలల సురక్ష కార్యక్రమం) పిఎంజెవై, బిహెచ్ఎ మొదలు సర్వే కార్యక్రమాలు అన్నిటిని, 104 సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఐదు నుండి పది వరకు ఉచితంగా డెలివరీలను నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పైన, వడ దెబ్బపైన ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి అజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

అప్రెంటీస్ మేళాలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ ఐటిఐ కళాశాల జిల్లా కన్వీనర్ టివి గిరి అన్నారు. ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం ప్రధాని మంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించారు. ఐటిఐ పాసైన సుమారు 91 మంది ఈ మేళా లో పాల్గొన్నారు. మైలాన్ లాబరేటరీస్ డిజిఎం హరికృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ హేమకిరణ్, జయ భేరి ఆటోమోటివ్ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ నాగరాజు, హెచ్.బి.ఎల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ కందివలస నుండి టి.రామకృష్ణ తదితరులు హాజరై అప్రంటీస్ మేళా నిర్వహించారు. మొత్తం 152 ఖాళీలు ప్రకటించారు. ఎప్రింటీస్‌కు ఎంపిక అయిన వారికి ఆయా పరిశ్రమలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు జిల్లా కన్వీనర్ టివి గిరి తెలిపారు.

హోంగార్డుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్; వేదికపై ఎఎస్‌పి సౌమ్యలత

హోంగార్డుల అవసరాలకు అండగా సొసైటీ

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

హోంగార్డుల ఆర్థిక అవసరాలకు అండగా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉంటుందని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారపు. వ్యక్తిగత రుణాల పరిమితిని సభ్యుల అంగీకారంతో రూ.75వేలు నుంచి లక్ష రూపాయలకు, మ్యారేజ్ రుణాలను రూ. 1 లక్ష నుండి రూ.2 లక్షలకు పెంచినట్లు తెలిపారు. హోంగార్డ్సు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వ సభ్య సమావేశం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమంతోపాటు హోంగార్డుల సంక్షేమానికి కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేసి, వారి ఆర్థిక అవసరాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. రుణాలపై ఇంత వరకు విధిస్తున్న 6 శాతం వడ్డీని 4.08 శాతానికి తగ్గిస్తున్నట్లుగా చ్పెప్పారు. సొసైటీని మరింత అభివృద్ధి, ప్రగతి పథం వైపు నడిపించేందుకు సభ్యుల నుండి సలహాలను, సూచనలను స్వీకరించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఆర్ఎస్ఐ ఎన్. గోపాల నాయుడు, ఇతర పోలీసు అధికారులు, కో-ఆపరేటివ్ సెక్రటరీ ఎం.సుశీల, ఎం.నీలకంఠం నాయుడు, డైరెక్టర్లు శంకరరావు, గోపాలరావు, పి.రమణ, వి.మహేశ్వరరావు, పి.బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న నాయకులు

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి వినతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలపాడులో రామాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన పెద్దలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని మంగళవారం ఆమె నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండోమెంట్ నిధుల నుంచి రామాలయ పునఃనిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీల సతీష్, జి.వెంకట రామనాయుడు, జి.దేవుడునాయుడు, బి.సత్యనారాయణ, బి.రాము, జిఎస్ నరేష్, బి.త్రినాధరావు, పి.శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నువ్వులు

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రకృతి వ్యవసాయంలో నువ్వులు, చిరుధా న్యాలు సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చని వెలుగు ఎపిఎం (ఎఫ్‌పిఒ) వెంకట రమణ అన్నారు. మంగళవారం దెందేరు గ్రామంలో జరిగిన గ్రామ సభలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నువ్వులు, చిరుధా న్యాలు పంటలో నవ ధాన్యాల పంట సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 125 కిట్లు రైతులకు పంపిణీ చేశారు. నువ్వులు, చిరుధాన్యాల పంటతో నవధాన్యాల విత్తనాలు కలిపి సాగు చేయడం వల్ల ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అందుతా యన్నారు. ఎరువులు, పురుగుల మందులు వాడకం తగ్గుతుందని, భూమిలో తేమశాతం నిల్వ ఉంటుందని, సేంద్రీయ కర్బనం మెరుగు పడుతుందని తెలిపారు. కుటుంబ అవసరాలకు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవచ్చని, పచ్చిరొట్ట పైర్లను పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, గ్రామ సంఘం అధ్యక్షులు ఎన్.వరలక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ శ్రావ్య, విఒఎ సంతోష్ కుమారి, ఐసిఆర్‌పిలు వరలక్ష్మి, కోమలత, ఫార్మర్ సైంటిస్ట్ సాయి లక్ష్మి, మహిళా రైతులు పాల్గొన్నారు.

'రామయ్య' దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి- బొబ్బిలి

కోటికిపైగా మొక్కలను నాటిన ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ పరిరక్షకుడు పద్మశ్రీ రామయ్య దేశానికే ఆదర్శనీయుడు, చిరస్మరణీయుడు అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, రోటరీ జిల్లా ఛైర్మెన్ జెసి రాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణంలో వనజీవి రామయ్య మరణం పట్ల నివాళులు అర్పిస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు వనజీవి రామయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ భావితరాల కోసం రామయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. రెండు మొక్కలను నాటి వాటి సంరక్షణ గాలికి వదిలేసే నేటి కాలంలో 50 సంవత్సరాలుగా కోటికి పైగా మొక్కలను పెంచటం, పర్యావరణ పరిరక్షణలో ఆయన దేశ చరిత్రలో మహోన్నతమైన ఘనతను సృష్టించారన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషికి భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించినదన్నారు. రామయ్య మరణించిన రోజును పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం రెండు మొక్కలను నాటి వాటికి రామయ్య మొక్కలుగా పేర్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో యెస్.శ్రీనివాసన్, శ్రీహరి, శివకాంత్, పువ్వల కృష్ణమోహన్, నాగరాజు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండగుంపాం దేవాలయాల్లో మంగళవారం ఎస్‌ఐ బి. గణేష్ ఆధ్వర్యంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు దేవాలయాలు, మత పరమైన పవిత్ర స్థలాల పరిరక్షణలో భాగంగా కొండగుంపాం గ్రామంలో గల మూడు దేవాలయాలలో ఆరు సీసీ కెమెరాలు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో గల రెండు రామాలయాలు, దుర్గాదేవి ఆలయంలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. కాగా మండలంలో ఇతర గ్రామాల పెద్దలందరూ వారి గ్రామంలో గల దేవాలయాలు చర్చిలు, మసీదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాలు నియంత్రణ చేయడంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఎస్‌సి కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఒబిఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో వార్డు, సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలో కులం, ఆదాయం, రైస్ కార్డు, బ్యాంకు అకౌంట్ జెరాక్సు కాపీలను సచివాలయాల పరిధిలో ఒబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వచ్చే నెల 10లోగా https://apobmms.apcfss.in దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాహనాల పార్కింగ్‌కు షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు తమ సొంత నిధులతో వాహనాల పార్కింగ్ షెడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఈ షెడ్డును న్యాయవాదుల సంఘ అధ్యక్షులు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సూరిదేముడు మాట్లాడుతూ న్యాయవాదులు సమకూర్చిన రూ.60వేల నిధులతో ఈ షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు న్యాయవాదుల వాహనాలు ఎండకు ఎండి వానకు తడుస్తుండేవని, షెడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఇకపై వాహనాలను షెడ్డులో నిలుపుదల చేసుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం ఈ షెడ్డులో న్యాయవాదుల ద్విచక్ర వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని, ఇకముందు కక్షి దారుల వాహనాల పార్కింగ్ షెడ్డు నిర్మాణానికి కూడా కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, బి.త్రిమూర్తులు, డబ్ల్యు.ఎన్. శర్మ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, బి.వెంకటరావు, బడబళ్ల రామకృష్ణ, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, ఎల్.అప్పారావు, శేఖర్, పిడిది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ పరిష్కార న్యాయస్థాన్ కోర్టు

ప్రజాశక్తి- గంట్యాడ

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 16వ తేదీన విద్యుత్ పరిష్కార న్యాయస్థాన్ క్యాంప్ కోర్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి త్రినాధరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గంట్యాడ సెక్షన్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు కన్జ్యూమర్ గ్రీవెన్స్ ఫారం చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వినియోగదారుల విద్యుత్ పై ఎటువంటి సమస్యలున్నా నేరుగా తెలియజేసి పరిష్కారం పొందగలరని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం కొటారుబిల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్యాంప్ కోర్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన మారడపూడి రాము (35) ఆటో పై ప్రయాణిస్తుండగా ఆటో నుంచి కిందకు జారి పడి మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్ల కింద పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవికి మృతుని తల్లి మారడపూడి దేవి ఫిర్యాదు చేశారు. ఆటో డ్రైవర్ తత్తల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీ 'డల్'

- వేసవి క్రీడాశిబిరాలకు ప్రోత్సాహకం ఏదీ ?
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- నిరాశలో విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం ఒక రూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదు. గత వైసిపి పాలనలో క్రీడలకు కనీస ప్రోత్సాహం లేకుండా పోయింది. టిడిపి కూటమి సర్కారు అయినా క్రీడలపై దృష్టి సారించి ప్రోత్సాహం ఇవ్వాలని కోచ్‌లు, క్రీడాకారులు కోరుతున్నారు. పేద విద్యార్థులు క్రీడలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా మే 1 నుంచి 30వ తేదీ వరకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఐదు నుంచి 15ఏళ్ల బాలురకు వాలీబాల్, అథ్లెటిక్స్ బ్యాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తారు. క్రీడా శిక్షణ శిబిరాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8.30 వరకూ, సాయంత్రం 4 నుంచి 7.30 వరకూ 6 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు శిక్షణ ఉంటుంది. ఇలా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డిఎస్‌ఎ) క్రీడా మైదానంలో ఏటా వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను వివిధ క్రీడల్లో తీర్చి దిద్దుతున్నారు. గతేడాది నిర్వహించిన వివిధ శిబిరాల్లో వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయని ప్రభుత్వం

వేసవి క్రీడా శిబిరాలకు ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి నిధులు విడుదల చేయడం లేదు. జిల్లా అధికారులు చొరవ తీసుకుంటున్న నేపథ్యంలో అరకొర సొమ్ములే వస్తున్నాయి. అవి ఏ మూలకూ సరిపోని పరిస్థితి. ఏటా శిక్షణ శిబిరాలపై అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దాతలు, కొంతమంది క్రీడాకారులు, కోచ్ సొంత డబ్బులు వెచ్చిస్తుండంతో శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఏటా అన్ని మండలాల్లో,నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా తీసుకుంటున్నారు. కానీ అందుకు తగిన విధంగా ప్రభుత్వం సహకరించడం లేదు. ఈ నేపథ్యంలో క్రీడాకారులు ఆసక్తిని కనబరచలేక పోతున్నారు. జిల్లాకు ఈ ఏడాది ప్రత్యేకంగా అన్ని ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కార్యాచరణను సిద్ధం చేశారు. క్రీడా సంఘాలు పీఈటి, పిడిలు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. అయితే ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు కొందరు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, సరైన ఏర్పాట్లు చేయకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఆట వస్తువులు, కోచ్‌లకు పారితోషికాలు, తాగునీరు, ఉదయం, సాయంత్రం అల్పాహారం వంటివి కూడా ఇవ్వడం లేదు. క్రీడాకారులే ఇవన్నీ సమకూర్చుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి శిక్షణ శిబిరాల వద్ద మంచినీరు, క్రీడా పరికరాలు వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. గతంలో ఒక శిబిరం నిర్వహిస్తే కోచ్‌కు ప్రోత్సాహకంగా రూ.2 వేలు పారితోషికం ఇచ్చేవారు. ఆట వస్తువులకు రూ.7 వేలు, గ్రౌండ్ నిర్వహణకు రూ.1000 ఇచ్చేవారు. అయితే గత ఇదేళ్లుగా వీటిని నిలిపివేశారు.

బాక్సింగ్‌లో తలబడుతున్న క్రీడాకారులు (ఫైల్)

శిబిరాలు నిర్వహించే అవకాశం

వేసవి శిక్షణ శిబిరాలు వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించే అవకాశం ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సంవత్సరం అధిక సంఖ్యలో శిబిరాలను నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నాం. నెల రోజుల పాటు సాగనున్న వేసవి శిక్షణ శిబిరాల అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభకనబర్చిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తాం.

ఎస్.వెంకటేశ్వరావు, డిఎస్‌డిఒ

ఒప్పందాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల కార్మిక శాఖ అధికార్ల వద్ద చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం గత ఫిబ్రవరి 10న కార్మిక శాఖ అధికారుల వద్ద కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత ఆగస్టు, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమలు జరిగిన డిఎ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. గతంలో జ్యూట్ యాజమాన్యం 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ చెక్‌లు ఇవ్వగా వాటిలో ఒకటి మాత్రమే చెల్లు బాటై మిగతా చెక్ లు చెల్లకుండా పోయాయని, వాటికి వెంటనే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023-24 రిటైర్డ్ కార్మికుల నుంచి జ్యూట్ యాజమాన్యం వసూలు చేసిన ప్రభుత్వానికి చెల్లించాల్సిన పిఎఫ్, ఈఎస్‌ఐ బకాయిలు వెంటనే చెల్లించి రిటైర్డ్ కార్మికులకు పింఛన్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పనకు చర్యలు తీసులోవాలని కోరారు. 2016 నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ కార్మికులు సుమారు 1200మంది ఉన్నారని వారికి నెలకు 30మందికి చొప్పున గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే జ్యూట్ యాజమాన్యంపై కార్మికులతో కలిసి పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న రామారావు

విజేతకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - బొబ్బిలి

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ విజేతగా నిలిచిన దీసరి భానుప్రసాద్‌ను బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం కోటలో సన్మానించారు. ఈ నెల 4 నుంచి 7వ తేదీలలో నేపాల్‌లోని ఎస్‌బికెయఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భాను ప్రసాద్ పాల్గొన్నాడు. 83 కిలోల విభాగంలో 220 కేజీల బరువులెత్తి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. విజేతగా నిలిచాడు. దీంతో ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. పట్టణంలోని గొల్ల వీధికి చెందిన భానుప్రసాద్ సాధారణ కుటుంబానికి చెందినవాడు. గత నెల ఎమ్మెల్యే బేబీ నాయన క్రీడాకారుడి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు చెక్కును అందజేశారు. ఈయన పట్టణంలో మై జిమ్ కోచ్ కేతిరెడ్డి సాయివరుణ్, శంబంగి పురుషోత్తం నేతృత్వంలో శిక్షణ పొందారు.

క్రీడాకారుడుని అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ఆట ప్రదర్శనతో దేశానికి అపారమైన కీర్తిని ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడని చెప్పారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్‌కి చెందిన కేతిరెడ్డి సాయివరుణ్, శంబంగి పురుషోత్తం, ముగడ శంకర్‌యాదవ్, తంగుడు వెంకటరమణ పాల్గొన్నారు.

చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

ఖాళీ స్థలాల్లోచెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని ఆరి గంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, శ్వేతాచలపతి పాఠశాల, దిబ్బవీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని కార్మికులను కోరారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పిండ బదిలీ ప్రక్రియ విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

పిండ బదిలీ ప్రక్రియ విజయవంతానికి శత శాతం కృషి చేస్తున్నామని జిల్లా పశువైద్య సంచాలకులు డాక్టర్ వైవి రమణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఆరికతోట మధుర గ్రామం జగన్నాథపురంలో రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం శ్రీనివాసరావుతో కలిసి పిండ బదిలీ పద్ధతి ద్వారా ఉత్తరాంధ్రలో మొదటి గిరిజాతి ఆవు దూడను ఉత్పత్తి చేసిన గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ వైవి రమణ, కార్యనిర్వహణ శాఖ అధికారి డిఎల్‌డిఎ డాక్టర్ జి.రాధాకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ దామోదర్‌రావు, సహాయ సంచాలకులు డాక్టర్లు విష్ణు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గతేడాది 350 పశువులకు పిండ బదిలీ ప్రక్రియ విజయవంతం చేయడానికి 45 మందికి శిక్షణ ఇప్పించామన్నారు. ఈ శిక్షణ ద్వారా 15 నుండి 20 శాతం మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. మేలు జాతి దూడలను ప్రత్యేకించి ఆడ దూడలను ఈ పద్ధతి ద్వారా పుట్టించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఒక జాతి అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ ద్వారా ఆరు నుండి ఏడు ఈతలలో 10 సంవత్సరాలు కాల వ్యవధి పడుతుందని, అదే పిండ బదిలీ ద్వారా మేలుజాతి దూడను కేవలం ఒక్క సంవత్సరం కాలంలోనే జరిపించే అవకాశం ఉందని అన్నారు. ఈ ప్రక్రియను ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 1500 వరకు పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా లక్ష్యాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆరికతోట పశువైద్యశాల ద్వారా చూలు కట్టిన పశువులకు ఉచితంగా పశువుల ధానా సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు లాభాల విష్ణు, ఆరికతోట పశు వైద్యాధికారి సురేష్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దూడను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్య సంచాలకులు రమణ

ఆ వెయ్యి రోజులు కీలకం

ప్రజాశక్తి- గంట్యాడ

గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలు పుట్టి బాలింతైన వరకూ సుమారు వెయ్యి రోజులు మహిళలకు కీలకమని, ఆరోజుల్లో చాలా జాగ్రత్తగా ఉండాలని ఐసిడిఎస్ పిఒ డి.ఉమాభారతి, పెద్దమజ్జిపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పల్లవి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా మంగళవారం గంట్యాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదమజ్జిపాలెంలో ర్యాలీ నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు నమోదు నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలు పెరిగినంత వరకూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా నివారించాలంటే ఏం చేయాలో వివరించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలిం తలు తదితరులు పాల్గొన్నరు.

ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, పిల్లలు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురంలో అంగన్వాడి ఎల్‌కోట సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పోషణ పక్వాడపై మంగళవారం గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిశువులు పోషణ గురించి పిల్లలు ఎదుగుదల గురించి ఏప పోషక ఆహారం తీసుకోవాలని ఆమె వివరించారు. శిశువుల్లో ఇన్స్‌పెక్షన్ రాకుండా తగు చర్యలు తీసుకోవాలని పిల్లలు తల్లిలకు వివరించారు. ఈ నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఈ పక్షోత్సవాల్లో భాగంగా పలు గ్రామాలు గృహాలకు సందర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు ఎస్‌ఐ కృషి

ప్రజాశక్తి - జామి

జామి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వీర జనార్ధన్ గో సంరక్షణకు మంచి కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ జనార్ధన్‌కు మంగళవారం పూలమాల వేసి శాలువా కప్పి గో మాత మేమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా లోగిశ మాట్లాడుతూ రాష్ట్రంలో లోట్లపల్లి పశువుల సంత పశుమాంస వ్యాపారులకు అడ్డాగా మారిందని చట్టాలు కసాయి వారి చుట్టలుగా మార్చారని ఈ సమయంలో ఎస్‌ఐ వీర జనార్ధన్ అత్యంత ధైర్య సాహసాలతో ఈ ఏడాదిలో 20కు పైగా గోవుల అక్రమ రవాణా వాహనాల పైన, కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఎస్‌ఐను మిగతా అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదే స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఈశ్వరరావు జంతు సంరక్షణకు ఎంతో కృషి చేస్తున్నందున గో మాత మేమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జనార్ధన్ మాట్లాడుతూ జంతు సంరక్షణ చట్టాలను అమలు చేయడానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి రవి శంకర్, జిల్లా మహిళా కార్యదర్శి నీలాపు దేవి, జిల్లా కమిటీ సభ్యులు వేమల యమున, పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

వేపాడ: పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులను కోరారు. మండలంలోని నీలకంఠ రాజపురం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఎన్‌కెఆర్‌పురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారుల వద్దకు వెళ్లి 'మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండి మీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత మాది' అని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యతో పాటు నాణ్యమైన భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుస్తకాలు, దుస్తులు, బడి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రైవేటు పాఠశాలలో విద్య కంటే, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు ప్రభుత్వ శిక్షణ తీసుకుని మెరుగ్గా ఉంటారని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పంపించాలని కోరారు.

అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు అవసరం

శృంగవరపుకోట

అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి షేక్ మదీనా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్నిమాపక వారోత్సవాలులో భాగంగా మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టారు సమక్షంలో రైల్వే సిబ్బందికి, ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫైర్ ఎక్సటింగుషర్స్‌ని ఉపయోగించే విధానం గూర్చి అవగాహన కల్పించారు.

భూ వివాదం నేపథ్యంలోనే హత్యాయత్నం

- జనసేన నాయకునిపై దాడిచేసిన అక్కునాయుడు అరెస్టు
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జనసేన నాయకునిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడును పోలీసులు గాలించి పట్టుకొని మంగళవారం విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను బొబ్బిలి డిఎస్‌పి భవ్య, సిఐ నారాయణరావు వివరించారు. గత కొన్నాళ్లుగా మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న వివాదాస్పద స్థలంలో నిందితుడు బోను అక్కునాయుడు కొంత స్థలాన్ని కొన్నారు. అయితే దీనిపై వివాదం ఉండటం జనసేన తరుపున ఆ స్థలంపై ఉద్యమాలు చేయడం ద్వారా హై కోర్టులో స్టే వచ్చింది. అయితే తాజాగా కోర్టు తీర్పు తనకు అనుకూలంగా రాకపోయినా అక్కునాయుడు తను కొన్న స్థలంలో ఫ్రూట్ బిజినెస్ చేసేందుకు ఉపక్రమించి నీడ కోసం సిమెంట్ స్తంభాలు పాతి వ్యాపారం చేసే ప్రయత్నాలు చేశాడు. దీన్ని గమనించిన జనసేన నాయకుడు మహంతి ధనంజయ వివాదంలో ఉన్న స్థలం, కోర్టు స్టే ఉండగా ఇలా ఇక్కడ వ్యాపారాన్ని చేయడం తగదని హెచ్చరించి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు. అది తెలుసుకున్న నిందితుడు అక్కునాయుడు కోపంతో రగిలి ప్రతిసారి అడ్డు తగులుతున్నాడని క్షణికావేశంలో ధనంజయ అడ్డు తొలగించుకోవాలని భావించాడు. అయితే ఇద్దరిదీ ఒకే వీధి కావడంతో ఇంట్లో ఉన్నాడేమో అని అదే వీధిలో కొబ్బరి బొండాలు అమ్మే కిళ్లీ బడ్డీ వద్ద ఉన్న ఇనుప కత్తిని చేజిక్కించుకొని దాడి చేయాలని పన్నాగం పన్నాడు. ఆ సమయంలో బాధితుడు ఇంట్లో లేడని తెలుసుకొని ఇదే దారిన వస్తాడని నిలిపి ఉంచిన ఒక ఆటోలో మాటువేసి వేచి ఉన్నాడు. ఈ కుట్ర తెలియని బాధితుడు ఎప్పటిలాగే పనులు ముగించుకొని నడిచి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి నిందితుడు కత్తితో తలపై వేటు వేయగా అలెర్ట్ అయిన బాధితుడు అడ్డుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో వీపు, ఎడమచేతి, తలతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయాల బాధతో పరుగెట్టడంతో పాటు చుట్టు పక్కల వాళ్లు ఈ ఉదంతాన్ని గమనించడంతో నిందితుడు మెల్లగా తప్పించుకున్నాడు. బాధితుని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం మెరుగైన చికిత్స అందిస్తూ జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో బాధిత ధనంజయ కోలుకుంటున్నాడని నిందితుడు అక్కునాయుడుపై కేసు నమోదు చేసి సాలూరు కోర్టుకు తరలిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రసాదరావు, ఎఎస్‌ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి

వైభవంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెఆర్‌పేట పంచాయతీ పరిధిలో గల ఎకెజిపాలెంలో గ్రామ దేవత మరిడిమాంబ పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. 35 ఏళ్ల తరువాత నిర్వహించిన ఈ పండగను రంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 4 గంటల నుండి గ్రామంలో గల విధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా కాళీమాత నృత్య ప్రదర్శన, తప్పెడ గుళ్ళు ప్రదర్శన, మహిళా కోలాటం, కంచు గుర్రాలు ఊరేగింపు, బండి ప్రభ ఊరేగింపు, డీజే సౌండ్ నృత్య ప్రదర్శనతో అమ్మవారి ఆలయానికి ఘట్టాలతో తరలివెళ్లారు. అమ్మవారిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి డి.సత్యవంతుడు, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తులసీ దంపతులు, ఎస్.కోట నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడ భారతి, నారాయణమూర్తి దంపతులు, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గుబాబు, పలువురు టిడిపి, వైసిపి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు

ఘటాల ఊరేగింపులో పాల్గొన్న గొంప దంపతులు

CHANGE OF NAME

I, PUPPALA JAYALAKSHMI, W/O BUDDHALA SRINIVASA RAO previously called BUDDHALA JAYALAKSHMI, Resident of MERAKA MUDIDAM MD, Korlam, Vizianagaram, Andhra Pradesh, 535128, Now changed my name from BUDDHALA JAYALAKSHMI TO **PUPPALA JAYALAKSHMI**. Hence forth I will be called as **PUPPALA JAYALAKSHMI** for all purpose.